RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 2. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 3. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 160.00 |
| 4. | యూనివర్సల్ మైండ్ | 130.00 |
| 5. | అమృతత్వ విద్య | 120.00 |
| 6. | పతంజలి యోగసూత్రాలు | 150.00 |
| 7. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు | 375.00 |
| 8. | సావిత్రి ఉపన్యాసాలు | 210.00 |
| 9. | నవయుగాన్ని నిర్మించే సావిత్రీ సాధన | 150.00 |
| 10. | భగవద్గీత ఉపన్యాసాలు 5 భాగాలు | 670.00 |
| 11. | ఆణిముత్యాలు (పై 5 భాగాల ముఖ్యాంశాలు) | 130.00 |
| 12. | మాస్టర్ ఆర్.కె. లెటర్స్ | 150.00 |
| 13. | ఆత్మకథ | 60.00 |
| 14. | ఆహార విజ్ఞానము | 60.00 |
| 15. | అకల్ట్ అనాటమీ, వాస్తు, ఆస్ట్రాలజీ, హోమియోపతి | 40.00 |
| 16. | విశిష్ట యోగసాధనలు | 40.00 |
| 17. | అనుగ్రహ మాలామంత్రము | 30.00 |
| 18. | భారతీయ జీవితవిధానము | 30.00 |
| 19. | శ్రీసూక్తము | 20.00 |
| 20. | ప్రకృతి ఎల్లప్పుడూ కరెక్టే | 15.00 |
| 21. | మానవజీవితముపై పాలపుంత యొక్క ప్రభావము | 15.00 |

ప్రతులకు :

✧ గురు సీతారామ్    కోమటిగుంట    90106 47325

ఆలోచనలు
ఆత్మిక
దివ్య విప్లవాలతో
2011 అక్టోబరు
నాటికి భూమిపై
వెలయనున్న

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే ఐశ్వర్యము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ, మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక

❋✧❋

✺ ఈ తల్లక్రిందుల ప్రపంచాన్ని సరిగా నిలబెట్టడానికి మానవశక్తి చాలదు. దైవశక్తి కావాలి.

అన్నిటికన్నా పెద్ద సమస్య సమర్థులైనవారి ఆలోచనాధోరణి దిశ మార్చటము. ధనవంతులుగానీ, పరిపాలకులుగానీ అందరూ పెడత్రోవనే పట్టివున్నారు.

✺ వీరందరూ విధ్వంసము చేయడములో తమకు ఉన్న సామర్థ్యాన్ని, నవ సృజన కోసము ప్రయత్నిస్తే,
స్వార్థము వదలి పరమార్థము కోసము ప్రయత్నిస్తే,
ప్రపంచ వాతావరణములో శాంతి, సౌఖ్యాలు నాట్యమాడతాయి.

యుగపరివర్తన జరిగి తీరుతుంది.

-- పండిత శ్రీరామశర్మ ఆచార్య

❋✧❋

రూ. 20.00    ఆగస్టు 2011    68

## విషయ సూచిక


- భూమిపై స్వర్గావతరణ తప్పకుండా జరిగి తీరుతుంది — 4
- 5000 సంవత్సరాల పరిణామక్రమం ఈనాడు మొగ్గలు తొడిగింది — 12
- వేద సంస్కృతి పునర్జాగరణ తప్పకుండా జరిగి తీరుతుంది — 21
- ఈ సంక్షోభ పవనాలు సత్యయుగారంభంలోని భాగమే — 27



| సంపుట - 6 | సంచిక - 8 |
|---|---|
| స్వర్ణయుగము మాసపత్రిక | |
| సంవత్సర చందా : రూ. 240.00 | |
| ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం. 00461 00110 20050 | |



చందా పంపించవలసిన చిరునామా :
పి. సీతారాముడు,
కోమటిగుంట - 534 237,
కాళ్ల మండలము,
పశ్చిమ గోదావరి జిల్లా.
ఫోన్ నెం. : 08816 - 241359
90106 47325



Printed and Published by P. Sita Ramudu and Printed at Bhavana Offset Printers, Vijayawada and Published at 50, Venugopala Nagar, Guntur - 4, A.P. Editor : P. Sita Ramudu

Admn Office : Komatigunta, Kalla (M), W.G. Dt.







జులై - ఆగస్టు నెలల్లో పత్రికకు, మాస్టరుగారి సాహిత్యానికి
ఆర్థిక సహాయము అందించిన పరిజనులు

| | |
|---|---|
| శ్రీమతి ఏ.వి. మీనాభాయి | రాజమండ్రి |
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం |
| శ్రీ ఐ. అవతారంరాజు | విశాఖపట్నం |
| చిరంజీవి రుషిత | హైదరాబాద్ |
| శ్రీ కె. సుబ్బారావు | విజయనగరం |
| శ్రీ వి. సుబ్బారావు | వాడరేవు |
| శ్రీ జి. చెన్నకేశవరావు | ఉండవల్లి సెంటరు |
| శ్రీ జి. మణికుమార్ | తాటివాకవారి పాలెం |

పై పరిజనులందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

# భూమిపై స్వర్గావతరణ తప్పకుండా జరిగి తీరుతుంది

ప్రపంచంలో ఏర్పడబోయే 3 రకాల పరిస్థితులు గురించి గత 12 సంవత్సరాలుగా స్వర్ణయుగము మాసపత్రిక చాలా ఆశగా ఎదురుచూస్తూవుంది.

***ఆ 3 రకాల పరిస్థితులు ఏమిటంటే,***

భూమిపై స్వర్గావతరణ!

వేద సంస్కృతి పునర్జాగరణ!!

శాంతి, సుఖము, సమృద్ధి అందరికీ!!!

మానవ సమాజంలో ఈనాడు సుఖానికి, సమృద్ధికి లోటు లేదు.

రోజు రోజుకీ పెరిగిపోతోన్న నిత్యావసర వస్తువుల ధరల గురించి 3.8.11 న పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు, మన దేశపు ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి పథకం మొదలైన కార్యక్రమాల వల్ల గ్రామాలలో కూడా ప్రజల యొక్క కొనుగోలు శక్తి బాగా పెరిగింది అని, అది అధిక ధరలకు కారణం అవుతోంది అని పేర్కొంటూ, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పటికీ దేశంలో ఎక్కడా "ఆకలి మరణాలు" లేవు అని తెలిపారు.

మన దేశంలో అనే కాదు, ప్రపంచంలోని ఇంచు మించు అన్ని దేశాలలో ఈ ఆహార సమృద్ధి ఉంది. సోమాలియా లాంటి దేశాలలో ఆహార సంక్షోభానికి ప్రధాన కారణం ఆ దేశంలోని వివిధ వర్గాల మధ్య జరుగుతోన్న ఘర్షణలు. బాధిత ప్రజలకు ఆహారాన్ని అందించడానికి ఐక్యరాజ్య సమితి చేస్తోన్న ప్రయత్నాలకు అక్కడి దోపిడీ ముఠాలు అవాంతరాలు కల్పించకుండా ఉండివుంటే అక్కడ కూడా ఆహార సంక్షోభం ఏర్పడివుండేది కాదు.



ఒకొక్కసారి మనం ఎవరి మీదో అలిగి భోజనం చేయడం మానేస్తూవుంటాం. లేదా ఒకొక్కసారి అనారోగ్యం కారణంగా భోజనం చేయకపోవచ్చు. లేదా ఆరోగ్య కారణాలతోనో, ఆధ్యాత్మిక కారణాలతోనో మనమే ఉపవాసం ఉండటానికి నిర్ణయించుకుని భోజనం చేయకపోవచ్చు.

ఇటువంటి సందర్భాలలో మనం భోజనం చేయకపోవడానికి కారణం ఆహారం అందుబాటులో లేకపోవడం కాదు. వేరే వివిధ కారణాల వలన మనం నిరాహారంగా ఉండాల్సి వస్తోంది.

ఇటీవల మన కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తోంది. దేశంలోని అందరికీ ఆహార భద్రతను కల్పించటానికి ఉద్దేశించిన ఈ బిల్లు ఇంకా పార్లమెంట్‌లో ఆమోదం పొందకుండానే దీనిని త్వరలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర ఆహార శాఖా మంత్రి కె.వీ. థామస్ 8.8.11 న ప్రకటించారు.

ఈ పథకం క్రింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు కిలో రూ. 3 లకు బియ్యం, కిలో రూ. 2 లకు గోధుమలు అందజేస్తారు.

మన రాష్ట్రంలో ఇప్పటికే కిలో రూ. 2 లకు బియ్యం పథకం అమలు అవుతోన్న విషయం తెలిసినదే. దీనిని మరింత విస్తరించి ఎస్సీ. ఎస్టీ వర్గాలకు ఒక రూపాయికే కిలో బియ్యం అందించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ విధంగా రకరకాల పథకాలతో మనిషి జీవించివుండటానికి అవసరమైన "కూడు, గుడ్డ, నీడ" అనే ఈ మూడు కనీస అవసరాలు సునాయాసంగా నెరవేరే పరిస్థితులు ఈనాడు భూమి మీద ఏర్పడ్డాయి.

మనిషి ఎప్పుడూ కేవలం కనీస అవసరాలతోనే తృప్తి పడలేడు. అతని మనస్సు అనేక రకాల సుఖాలను కూడా వాంఛిస్తూవుంటుంది.

ఆధునిక విజ్ఞానం పుణ్యమా అని ఈ సుఖ సామాగ్రి కూడా మానవజాతికి ఎన్నడూ లేని విధంగా చాలా అందుబాటులోకి వచ్చింది. మనిషి ఏ మాత్రం వాటి కోసం ప్రయత్నం చేసినా, అవి అతనికి చాలా అందుబాటులోకి వచ్చేశాయి.

- మేడలు, మిద్దెలు ఒకప్పుడు బాగా ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు మధ్య తరగతి వారు కూడా వాటిల్లో నివశించ గలుగుతున్నారు. బడుగు వర్గాలు కూడా ప్రభుత్వం యొక్క ఆసరాతో గుడిసెలు స్థానంలో పక్కా గృహాలను కట్టుకోగలుగుతున్నారు.
- టెలిఫోన్లు, సెల్ ఫోన్‌లు బాగా ధనికి వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడవి నిరుపేదల జీవితంలో కూడా భాగం అయిపోయాయి.
- విమానయానం కూడా అంతే. మధ్య తరగతి వ్యక్తులు విమానయానం గురించి కనీసం ఊహలో కూడా ఆలోచించేవారు కాదు.
  ఇప్పుడు పేద ప్రజలు కూడా జీవనోపాధిని వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలు మొదలైన చోట్లకి విమానంలో వెళ్ళగలుగుతున్నారు.

ఒకప్పుడు ధనవంతులు విమానాలలో విదేశాలకు వెళితే, జీవనోపాధి వెతుక్కుంటూ వెళ్ళేవారు నౌకల్లో సముద్రయానం చేయాల్సి వచ్చేది.

- ఈ విధంగా ఒకప్పుడు ధనవంతులకు మాత్రమే లభించే అన్ని సుఖ సాధనాలు ఈనాడు అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు పేద వారు ఎంత ప్రయత్నించినా వీటని పొందగలిగేవారు కాదు.
- ధనవంతులు, మధ్య తరగతివారు, నిరుపేదలు - ఈ మూడు వర్గాల ప్రజలు అన్ని కాలాలలో, అన్ని దేశాలలో ఎప్పుడూ ఉంటారు.



మనం భూతల స్వర్గంగా భావించే అమెరికాలో కూడా ఈ మూడు వర్గాల ప్రజలూ ఉన్నారు. బాగా వెనుక బడిన ఆఫ్రికా దేశాలలో కూడా ఈ మూడు వర్గాల ప్రజలూ ఉన్నారు.

**అమెరికాలో ఉన్న పేదవారికి, ఆఫ్రికాలో ఉండే పేదవారికి తేడా ఏమిటంటే,**

- అమెరికాలో ఉండే పేదవారికి "ఉచిత ఆహారశాలలు, సామాజిక భద్రత" మొదలైన సౌకర్యాలతో కనీస అవసరాలు అప్రయత్నంగా తీరితే, వాటి కోసం ఆఫ్రికా దేశాలలోని పేదవారు కొంచెం ప్రయత్నం చేయాల్సి వస్తుంది.
- అమెరికాలో ఉండే పేదవారు చాలా తక్కువ ప్రయత్నంతో సుఖ సాధనాలను పొందగలిగితే, ఆఫ్రికాలో ఉండే పేదవారు వాటి కోసం తీవ్రమైన ప్రయత్నం చేయాల్సి ఉంటుంది.
- ఈ విధంగా కాలము యొక్క మహిమ వలన ఈ రెండు ప్రదేశాలలోని పేదవారికీ కూడా కనీస అవసరాలు, సుఖసాధనాలు అందుబాటులోనే ఉన్నాయి.

సత్యయుగంలోని పేదవారికి, కలియుగంలోని పేదవారికి ఉండే తేడా అదే. సత్యయుగంలోని పేదవారికి కనీస అవసరాలు, సుఖసాధనాలు చాలా బాగా అందుబాటులో ఉంటే, కలియుగంలో అవి గగన కుసుమంగా కనిపిస్తాయి.

మనిషి యొక్క స్థితిగతులపై కాలము యొక్క ప్రభావము ఏ విధంగా ఉంటుందో వివరించడానికి మన పెద్దలు ఒక కథ చెబుతూవుంటారు.

మన జీవితంలో ఉండే అనుకూల కాలము, వ్యతిరేక కాలము గురించి జ్యోతిశ్శాస్త్రం చాలా బాగా వివరిస్తుంది.

మన జీవితంలో ఉండే అననుకూల కాలము అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది ఏమిటంటే, ఏలినాటి శని ప్రభావం ఉండే కాలము.

ఈ ఏలినాటి శని ఉండే కాలంలో మనిషి పరిస్థితులకు ఎదురీదుతూ చాలా బాధలకు గురిఅవుతూ ఉంటాడు.

మానవ జీవితంలో ఉండే ఈ శని ప్రభావం గురించి ఒకసారి కైలాసంలో శనీశ్వరుడికి, ఈశ్వరుడికి మధ్య ఒక చర్చ జరిగిందిట. ఆ చర్చలో శివుడు మాట్లాడుతూ, "నీ ప్రభావాన్ని చూపించాల్సిన కాలంలో మనుష్యుల్ని బాగా పీడిస్తున్నావు. కానీ నన్ను మాత్రం నువ్వు ఏమీ చేయలేవు" అన్నాడట.

దానికి శనీశ్వరుడు "రేపు నీ మీద ప్రభావం చూపించటానికి నాకు అనుమతి ఇస్తే, నేను నిన్ను తప్పకుండా పీడించగలను" అన్నాడట.

దానికి శివుడు సరే అని మర్నాడు తన మీద శని గ్రహం ప్రభావం ఉండటానికి ఒప్పుకున్నాడు. శనీశ్వరుడు అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు శనీశ్వరుడి ప్రభావం నుండి తప్పించుకోవటానికి శివుడు ఒక చెట్టు తొర్రలో దాక్కొని కూర్చుని, ఆ రోజు పూర్తి అయిన తరవాత తిరిగి కైలాసానికి వచ్చి, శనీశ్వరుడికి కబురు చేశాడట.

శనీశ్వరుడు రాగానే శివుడు "నేను నిన్న హాయిగా ఒక చెట్టు తొర్రలో కూర్చొని ఉన్నాను. నువ్వు నన్ను ఏమీ చేయలేకపోయావు" అన్నాడట.

దానికి శనీశ్వరుడు నవ్వుతూ, "మహాదేవా! ప్రమథ గణాలు సేవిస్తూ ఉండగా, దేవ గణాలు స్తుతిస్తూ ఉండగా, ఋషి గణాలు కీర్తిస్తూ ఉండగా, పార్వతీ మాతతో కైలాసం మీద నిండు కొలువై ఉండాల్సిన నువ్వు, ఒక చెట్టు తొర్రలో ఉండాల్సి వచ్చింది అంటే, అది నా ప్రభావం కాక ఇంకేమిటి?" అన్నాడట.

అంచేత ఆ కాల ప్రభావాన్ని మనం తప్పించుకోలేం. కాల ప్రభావం వలన జరిగే చెడునే కాదు, మంచిని కూడా మనిషి తప్పించుకోలేడు.



ఏదైనా ఒక మనిషికి కారులో తిరిగే యోగం ఉంటే, అతను ఏ మాత్రం ప్రయత్నించినా, కారును కొనుక్కొని ఒక యజమానిగా అందులో తిరుగుతాడు. ఒకవేళ అతను ఏ మాత్రమూ ప్రయత్నించకపోతే, పరిస్థితుల ప్రభావం వలన ఒక కారు డ్రైవరుగా మారి, ఆ కారులో యజమానితో పాటు విహరిస్తాడు.

అదే విధంగా ఒక భవంతిలో ఉండే యోగం ఉంటే, అతను ఏ కొంచెం ప్రయత్నం చేసినా, ఒక భవంతికి యజమాని కాగలుగుతాడు. ఒకవేళ ప్రయత్నించకపోతే, ఒక అందమైన భవనంలో నమ్మకమైన పనివాడుగా మారి, ఆ చలువరాతి భవనం యొక్క సౌఖ్యాన్ని ఆస్వాదిస్తాడు.

- అంచేత ప్రారబ్ధకర్మ వలన కలిగే శుభాశుభ యోగాలను సాధారణంగా తప్పించుకోలేం. మనం చేసే ప్రయత్నం ఆధారంగా వాటి రూపురేఖల్లో తేడా వస్తుంది తప్ప, మనం పొందాల్సిన అనుభూతిలో తేడా రాదు.

**ఇప్పుడున్న మానవజాతి యొక్క అదృష్టం ఏమిటంటే,**

భూమి మీద ప్రస్తుతం ఉన్న పరిస్థితులు కాలచక్ర భ్రమణంలో కలి యుగం నుండి సత్యయుగంలోనికి పరిణామం చెందుతున్నాయి అని మహాత్ములు చెబుతున్నారు.

అందుచేతనే సమస్త మానవజాతికి అప్రయత్నంగా కనీస అవసరాల యొక్క సమృద్ధి అందుబాటులోకి వచ్చింది. కొద్ది పాటి ప్రయత్నం చేయగలిగితే సుఖసాధనాలు సమస్త మానవజాతికి అందుబాటులోకి వచ్చాయి.

- అప్రయత్నంగా కనీస అవసరాల సమృద్ధి అందుబాటులోకి వచ్చింది.
- ప్రయత్నం చేయగలిగితే సుఖసాధనాలు అందుబాటులోకి వచ్చాయి.
- కానీ ఎంత ప్రయత్నం చేసినా మానవజాతికి అందుబాటులో లేని ఇంకొక ముఖ్యమైన అనుభూతి ఉంది. అది ఏమిటంటే, "శాంతి".

❀ కలియుగంలో అంత తేలికగా లభ్యము కానిది, సత్యయుగంలో నిరంతరం అందుబాటులో ఉండే అనుభూతి ఏమిటంటే, "శాంతి".

❀ దీనికి కారణము ఏమిటంటే, కలియుగంలో మనిషి సమృద్ధి నుండి సుఖాన్ని, సుఖము నుండి శాంతిని పొందటానికి ప్రయత్నిస్తాడు.

-- కానీ ఈ సుఖలాలస మనిషిని ప్రకృతి నుండి దూరం చేయడంతో అతనికి శాంతి ఎప్పుడూ ఒక అందని అనుభూతిగానే ఉండిపోతుంది.

ఈనాటి మన సుఖ సాధనాలు అన్నీ మనల్ని ప్రకృతి జీవనం నుండి దూరం చేస్తూనే ఉన్నాయికదా!

ఈ సమస్త బ్రహ్మాండము, మన మానవ శరీరమనే పిండాండము, ఈ రెండూ ఒకే ప్రాకృతిక నియమాలతో నిర్మించబడి, నిర్వహింపబడుతున్నాయి అని యోగశాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

అంచేత మనిషి ఎప్పుడైతే ప్రాకృతిక నియమాలను పాటించడో, ఏదో ఒక తెలియని మానసిక సంఘర్షణతో అతనికి శాంతి అనేది ఒక అందని అనుభూతిగానే మిగిలిపోతుంది.

దీనితో మనిషి సుఖంగా జీవిస్తాడుకాని, తృప్తిగా జీవించలేడు.

అంచేత మనకు శాంతి లభించాలి అంటే, తృప్తి లభించాలి అంటే, మన జీవితం ప్రకృతికి అనుగుణ్యంగా ఉండేలాగా మలచుకోవాలి.

❀ ఈ సమస్త బ్రహ్మాండాన్ని నడిపించే ప్రాకృతిక నియమాలను తెలియజేసేవే "వేదాలు".

-- అంచేత ఈ వేదాలు ఆధారంగా మన జీవిత విధానం మలచబడినప్పుడు మాత్రమే మానవజాతికి శాంతి అనేది అందుబాటులోకి వస్తుంది.



అంచేత మానవజాతికి శాంతి లభ్యము కావాలి అంటే, ఈనాటి మానవ సమాజంలో ఉన్న రకరకాల సంక్షోభాలు నివారింపబడాలి అంటే, వేద సంస్కృతి పునర్జాగరణ జరగాల్సి ఉంది.

మానవజాతి తిరిగి ప్రకృతి సాహచర్యంలో జీవించాల్సి ఉంది.

మనిషి ప్రకృతి సాహచర్యంలో జీవించే ఈ వేదమయ జీవనం వలన అతనికి కేవలం శాంతి, తృప్తి మాత్రమే కాదు, ఇంకొక విశేషమైన పరిణామం అతనిలో కలుగుతుంది. అతనిలో దైవీ చేతనత్వం జాగృతం అవుతుంది.

దేవతలు అందరూ ప్రాకృతిక శక్తులే అని డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు (మాస్టరుగారు) చెబుతూవుంటారు.

ఆ ప్రాకృతిక శక్తులకు మనిషి కూడా ఎప్పుడైతే అనుగుణ్యంగా జీవించాడో, అప్పుడు అతను కూడా ఒక దేవతగా రూపాంతరం చెందుతాడు. ఈ భగవంతుడి యొక్క సృష్టిలో అతని ద్వారా కూడా ఒక విశేషమైన ప్రాకృతిక శక్తి ప్రసరిస్తుంది.

ఎప్పుడైతే సమస్త మానవజాతి వేద సంస్కృతి పునర్జాగరణతో దేవతలుగా మారతారో, అప్పుడు ఈ పృథ్వి స్వర్గంగా మారుతుంది.

ప్రస్తుతం ప్రపంచంలోని రాజకీయ, ఆర్థిక రంగాలలో జరుగుతోన్న వివిధ విప్లవాత్మక పరిణామాలు తిరిగి మానవజాతిని ప్రాకృతిక జీవనం వైపు పురిగొల్పేవిగానే ఉన్నాయి.

అంచేత మహాకాలుడి లక్ష్యాలు అయిన "భూమి పై స్వర్గావతరణ", "వేద సంస్కృతి పునర్జాగరణ", "శాంతి, సుఖము, సమృద్ధి అందరికీ" అతి త్వరలో నెరవేరతాయి అని ఆశిద్దాం.

# 5000 సంవత్సరాల పరిణామక్రమం ఈనాడు మొగ్గలు తొడిగింది

సత్యయుగ పునరాగమనం గురించి సమాజంలో ఎప్పుడు చర్చించినా మొట్టమొదట మనం ఎదుర్కొనే ప్రశ్న ఏమిటంటే,

"కలియుగం 4,32,000 సంవత్సరాల పాటు ఉంటుందికదా! శ్రీకృష్ణ నిర్యాణం తరవాత కలియుగం ప్రారంభమైతే, ఇప్పటికి సుమారు 5000 సంవత్స రాలే కదా పూర్తి అయింది. ఇంకా సుమారు 4 లక్షల సంవత్సరాల పాటు ఈ కలియుగమే కదా ఉంటుంది?"

ఎదుటివాళ్ళు నమ్మినా, నమ్మకపోయినా మాస్టరుగారు చెప్పే ఒక వివరణని పై ప్రశ్నకు సమాధానంగా మనం ఇస్తూవుంటాం. అది ఏమిటంటే,

"పరిణామక్రమంలో భూమి మధ్య బిందువుకు చేరుకోవడం వలన శ్రీకృష్ణుడు, వ్యాసమహర్షి యొక్క ప్రయత్నాలతో 4,32,000 సంవత్సరాల పాటు నడవాల్సిన కలియుగం సుమారు 5000 సంవత్సరాలకే కుదించబడింది. అంచేత అతి త్వరలో సత్యయుగ పునరాగమనం జరుగుతుంది".

పరిణామక్రమంలో మానవీయ ఆత్మ పొందాల్సిన వివిధ అనుభూతు లకు గాను సత్యయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అనే 4 రకాల కాల పరిస్థితులు ఏర్పాటు చేయబడ్డాయి.

కలియుగంలో మనిషి నిద్రపోతూవుంటాడని,

ద్వాపరయుగంలో మనిషి మంచం మీదే మేలుకొని ఉండాడని,



త్రేతాయుగంలో మనిషి లేచి నిలబడతాడు అని,

సత్యయుగంలో మనిషి నడక ప్రారంభిస్తాడు అని మాస్టరుగారు సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలలో తెలియజేశారు.

- అంటే కలియుగంలో మనిషి తాను పరమాత్మ యొక్క అంశను అనే ఆత్మభావనను పూర్తిగా మర్చిపోతాడు.
  ద్వాపరయుగంలో మనిషి తన ఆత్మస్థితిని గుర్తిస్తూ జీవిస్తాడు.
  త్రేతాయుగంలో తన ఆత్మస్థితిని అవగాహన చేసుకుంటూ జీవిస్తాడు.
  సత్యయుగంలో ఒక ఆత్మగా, పరమాత్మగా జీవిస్తాడు.

ఈ విధంగా కలియుగంలో తన ఆత్మస్థితిని, పరమాత్మను మర్చిపోయిన మనిషి, పూర్తిగా భౌతికవాదిగా మారిపోతాడు.

ఆ స్థితిలో అతడు పొందే వివిధ రకాల అనుభూతులు, కర్మ పాఠాలు గురించి 4,32,000 సంవత్సరాల పాటు సాగే కలియుగం ఏర్పాటు చేయబడింది.

- ఏవైనా కొన్ని విశేష పరిస్థితులు కల్పించి, 4,32,000 సంవత్సరాలలో మానవజాతి పొందాల్సిన అనుభూతుల్ని, గుణపాఠాల్ని అంతకంటే తక్కువ సమయంలోనే మానవజాతికి అందించగలిగితే, అప్పుడు కలియుగం 4 లక్షల 32 వేల సంవత్సరాలు ఉండనవసరం లేదు. ఆ విశేష పరిస్థితుల్ని బట్టి అంతకంటే తక్కువ సమయమే సరిపోతుంది.
- చాలా తక్కువ సమయంలోనే చాలా ఎక్కువ అనుభూతుల్ని పొందే పరిస్థితి మనకు సాధారణంగా స్వప్నావస్థలో కలుగుతూవుంటుంది.

కలల్లో మనకు ఒక ఐదారు నిమిషాల వ్యవధిలోనే కొన్ని రోజులు, సంవత్సరాలకు సంబంధించిన సంఘటనలు మారిపోతూవుంటాయి. ఆ స్వల్ప వ్యవధిలోనే కొన్ని సంవత్సరాలకు సరిపడా అనుభూతుల్ని పొందుతాం.

అదే విధంగా మన భౌతిక జీవన వేగాన్ని పెంచగలిగితే, లక్షలాది సంవత్స రాలలో పొందే అనుభూతుల్ని, వేలాది సంవత్సరాలలోనే పొందగలుగుతాం.

- 4,32,000 వేల సంవత్సరాల కలియుగ కాల పరిమాణంలో మనం పొందాల్సిన అనుభూతుల్ని 5,125 సంవత్సరాలలో పొందాలి అంటే, మన జీవన వేగం లేదా మన జీవన పరిణామక్రమం వేగం సుమారు 84 రెట్లు పెరగాలి.

ఈ విధంగా 4,32,000 సంవత్సరాల కలియుగాన్ని 5,125 సంవత్సరాలకు కుదించడానికి భూమి మీద ఉండే మానవ జీవిత పరిణామక్రమ వేగాన్ని శ్రీకృష్ణుడు, వ్యాసమహర్షి సుమారు 84 రెట్లు పెంచివుంటారు అని ప్రస్తుతానికి మనం అంగీకరిద్దాం. మహాత్ములు చెబుతున్నట్లుగా అతి త్వరలో సత్యయుగ పునరాగమనం జరిగితే, ఆ వివరాలు అప్పుడు మనకు తప్పకుండా తెలుస్తాయి.

- ఇక్కడ సుమారు 5,000 సంవత్సరాలు అనే సంఖ్య బదులు 5,125 సంవత్సరాలు అని పేర్కొనడానికి కారణం ఏమిటంటే, స్వర్ణయుగము మాసపత్రికలో తరచుగా ప్రస్తావిస్తోన్న మాయన్ క్యాలండర్, ఈ 5,125 సంవత్సరాల యొక్క పరిణామక్రమాన్ని తెలియజేస్తోంది.

గత 5,125 సంవత్సరాలలో భూమి మీద జరిగిన పరిణామాలు, తద్వారా మానవ జీవితపు అనుభూతుల్లో వచ్చిన వేగాన్ని మాయన్ క్యాలండర్ ఆధారంగా అవగాహన చేసుకుంటే, 4,32,000 సంవత్సరాల కలియుగాన్ని 5,125 సంవత్సరాలకు కుదించటం సంభవమే అనే నమ్మకం మనకు తప్పక కలుగుతుంది.

***శ్రీకృష్ణుడి యొక్క 5,000 సంవత్సరాల ప్రణాళిక ప్రధాన లక్ష్యం ఏమిటంటే,***

సత్యయుగ పునరాగమనం, తద్వారా భూమి మీద దేవమానవ సమాజంతో వసుధైక కుటుంబం ఏర్పడటం అని మహాత్ములు చెబుతున్నారు.



మాయన్ క్యాలండర్ ఆధారంగా గత 256 సంవత్సరాలుగా భూమి మీద జరుగుతోన్న పరిణామాలను అవగాహన చేసుకుంటే, ప్రపంచం "వసుధైక కుటుంబం" దిశగా చాలా వేగంగా ప్రయాణం చేస్తోంది అనే విషయం మనకు చాలా స్పష్టంగా అర్థమవుతోంది.

అంచేత 5,125 సంవత్సరాల పరిణామక్రమం గురించి వివరిస్తోన్న మాయన్ క్యాలండర్‌ను శ్రీకృష్ణుడు, పరమ గురువుల యొక్క ప్రణాళికకు ఒక సంకేతంగా మనం నిస్సందేహంగా భావించవచ్చు.

గత 5,125 సంవత్సరాల నుండి 4 చరణాలలో భూమి మీద జరుగుతోన్న పరిణామక్రమాన్ని మాయన్ క్యాలండర్ ఈ క్రింది విధంగా తెలియజేస్తోంది.

| చరణం | కాల అవధి | | | వేగం |
|---|---|---|---|---|
| మొదటి చరణం | క్రీ.పూ. 3115 | నుండి | క్రీ.శ. 2011 | |
| రెండవ చరణం | క్రీ.శ. 1755 | నుండి | క్రీ.శ. 2011 | 20 రెట్లు |
| మూడవ చరణం | 5.1.1999 | నుండి | 28.10.2011 | ఇంకొక 20 రెట్లు |
| నాలుగవ చరణం | 11.2.2011 | నుండి | 28.10.2011 | ఇంకొక 18 రెట్లు |

***ఈ విధంగా భూమి మీద జరుగుతోన్న పరిణామక్రమం,***

మొదటి చరణం కంటే రెండవ చరణంలో 20 రెట్లు అధిక వేగంతో,
మూడవ చరణంలో 20 X 20 = 400 రెట్ల వేగంతో,
నాలుగవ చరణంలో 400 X 18 = 7200 రెట్ల వేగంతో జరుగుతుంది.

క్రీ.పూ. 3115 లో ప్రారంభం అయిన మొదటి చరణం కంటే రెండవ చరణం ప్రారంభం అయిన క్రీ.శ. 1755 తరవాత ఆధునిక విజ్ఞానం యొక్క ఆవిష్కరణతో భూమి మీద జరిగిన పరిణామక్రమం యొక్క వేగం మనకు చాలా స్పష్టంగానే అర్థమవుతోంది.

② ఈ రెండవ చరణం ప్రారంభం అయిన 1755 తరవాత ప్రపంచం మొత్తం ఒకే కుటుంబంగా జీవించడానికి అవసరమైన ప్రయాణ సౌకర్యాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు ఏర్పడ్డాయి.

-- ఈ రెండవ చరణం ప్రారంభంలోనే యూరప్ నుండి వలస వెళ్ళిన ప్రజలతో ఏర్పడిన 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు' అనే ఒక క్రొత్త దేశం మూడవ చరణం ప్రారంభం అయ్యే నాటికి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగింది.

③ మూడవ చరణం ప్రారంభం 5.1.1999 తరవాత కంప్యూటర్, ఇంటర్నెట్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థలు బాగా అభివృద్ధి చెందడంతో మానవ జీవన వేగం మరింత పెరిగి, ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిపోయింది.

-- ప్రపంచం యొక్క ఆర్థిక వ్యవస్థలు అన్నీ పరస్పరం విడదీయరానంత గాఢంగా పెనవేసుకొనిపోవడంతో, ప్రపంచంలో ఎక్కడ సమస్య ఏర్పడినా, ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా దానిని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

-- "అమెరికా తుమ్మితే, ప్రపంచ దేశాలకు జలుబు చేస్తుంది" అనే స్థాయిలో మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితులు ఈ మూడవ చరణంలో అమెరికా ద్వారా ఏర్పడ్డాయి.

④ నాలుగవ చరణం ప్రారంభం అయిన 11.2.2011 తరవాత ప్రపంచంలోని వివిధ దేశాలలో తలయెత్తిన ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు, ఆర్థిక సంక్షోభాలు కారణంగా ప్రపంచంలోని పరిణామాలు చాలా వేగంగా అనూహ్యంగా మారిపోతూ, "ఒకే విశ్వం - ఒకే కరెన్సీ" ఏర్పడితే తప్ప పరిష్కరించలేని "ప్రపంచ సంక్షోభం"గా అవి పరిణమిస్తున్నాయి.

-- ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలకు వెన్నుముకగా నిలిచిన అమెరికా సైతం దివాళా దిశగా పయనించే పరిస్థితులు ప్రస్తుతం ఏర్పడుతున్నాయి.



మాయన్ క్యాలండర్ తెలియజేస్తోన్న 5,125 సంవత్సరాల పరిణామ క్రమంలోని 4 చరణాలలో, ఒకొక్క చరణం 13 దశలలో జరుగుతుంది.

- ఈ 13 దశల పరిణామక్రమం 7 రోజులుగా అందులో విభజింపబడింది.

-- మొదటి 6 రోజులలో పగలు, రాత్రి చొప్పున 2 దశలలో పరిణామక్రమం జరిగితే, 7 వ రోజున మాత్రం కేవలం పగటి దశ మాత్రమే ఉంటుంది.

- ఈ 13 దశలలో పగటి వేళ దశలో పరిణామక్రమంలో ఒక క్రొత్త మార్పుకి నాంధి జరిగితే, రాత్రి వేళలో ఆ మార్పు పూర్తిగా నెరవేరుతుంది.

***ఉదాహరణకు 4 వ చరణంలోని పరిణామక్రమం ఈ క్రింది విధంగా నెరవేరుతుంది.***

| | | | |
|---|---|---|---|
| 1 వ రోజు | పగలు | బీజారోపణ | 11.2.2011 నుండి 2.3.2011 వరకు |
| | రాత్రి | | 3.3.2011 నుండి 22.3.2011 వరకు |
| 2 వ రోజు | పగలు | మొలకెత్తుట | 23.3.2011 నుండి 11.4.2011 వరకు |
| | రాత్రి | | 12.4.2011 నుండి 1.5.2011 వరకు |
| 3 వ రోజు | పగలు | మొక్క పెరుగుట | 2.5.2011 నుండి 21.5.2011 వరకు |
| | రాత్రి | | 22.5.2011 నుండి 10.6.2011 వరకు |
| 4 వ రోజు | పగలు | వ్యాపించుట | 11.6.2011 నుండి 30.6.2011 వరకు |
| | రాత్రి | | 1.7.2011 నుండి 20.7.2011 వరకు |
| 5 వ రోజు | పగలు | మొగ్గ తొడుగుట | 21.7.2011 నుండి 9.8.2011 వరకు |
| | రాత్రి | | 10.8.2011 నుండి 29.8.2011 వరకు |
| 6 వ రోజు | పగలు | పుష్పించుట | 30.8.2011 నుండి 18.9.2011 వరకు |
| | రాత్రి | | 19.9.2011 నుండి 8.10.2011 వరకు |
| 7 వ రోజు | పగలు | ఫలించుట | 9.10.2011 నుండి 28.10.2011 వరకు |

గత 256 సంవత్సరాలలో ఆవిష్కరింపబడిన కమ్యూనికేషన్ వ్యవస్థలు ప్రపంచం మొత్తాన్ని ఏకసూత్రంతో కలిపినప్పటికీ, ఈనాడు ప్రపంచంలో ఉన్న 193 దేశాలు మధ్య ఉన్న విభజన రేఖలు, వివిధ రకాల శాసన వ్యవస్థలు, ఆయా దేశాధినేతల యొక్క స్వార్థ చింతన మొదలైనవి "వసుధైక కుటుంబం" ఏర్పడటానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి.

అంతేకాకుండా ఈనాడు ఉన్న శాసన వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు పారివారిక సూత్రాలతో కాకుండా అధికారం, స్వలాభాపేక్షలకు సంబంధించిన నియమ నిబంధనలతో కూడుకొని ఉన్నాయి.

- అంచేత ఈనాడు ఉన్న ఈ వ్యవస్థలు పారివారిక (కుటుంబ) సూత్రాలతో పునర్నిర్మించబడితే తప్ప "వసుధైక కుటుంబం" ఏర్పడదు.
- అంతే కాకుండా వివిధ ప్రపంచ దేశాల మధ్య ఉండే విభజన రేఖలు పరిపాలనా సౌలభ్యం కోసం మాత్రమే పునర్విభజింపబడి, ఒకే విశ్వ ప్రభుత్వం ఏర్పడితే తప్ప "వసుధైక కుటుంబం" ఏర్పడదు.

ప్రస్తుతం 11.2.2011 నుండి జరుగుతోన్న 4 వ చరణంలోని పరిణామ క్రమంలో ఈ "వసుధైక కుటుంబం" ఆవిర్భావానికి సంబంధించిన ఆకస్మిక మార్పులు విశ్వవ్యాప్తంగా చాలా వేగంగా జరుగుతున్నాయి.

***ఈ మార్పులు ఎంత వేగంగా జరుగుతున్నాయి అంటే,***

ఎప్పుడు ఏ రాజకీయ ఉపద్రవం ముంచుకొస్తుందో, ఏ ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తుందో అని ప్రతీ దేశాధినేతా ఈనాడు భయపడుతున్నాడు.

ః ప్రపంచంలో ఈనాడు జరుగుతోన్న సంఘటనలను నిశితంగా గమనిస్తే, "4 వ చరణానికి సంబంధించిన పరిణామక్రమం అనే వృక్షం" 21.7.2011 తరవాత "మొగ్గలు తొడిగింది" అనే విషయాన్ని స్పష్టంగా గుర్తించవచ్చును.



① బీజారోపణ — 11.2.2011 నుండి 22.3.2011 వరకు

-- 4 వ చరణం పరిణామక్రమానికి బీజారోపణ జరిగిన 11.2.2011 నాడే ఈజిప్టులో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం విజయాన్ని సాధించింది. దానితో అధ్యక్షుడు హోస్నీ ముబారక్ తన పదవికి రాజీనామా చేశాడు.

② మొలకెత్తుట — 23.3.2011 నుండి 1.5.2011 వరకు

-- లిబియా, యెమన్, సిరియా మొదలైన అరబ్ దేశాలలో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు చాలా తీవ్రస్థాయిని సంతరించుకున్నాయి.
తిరుగుబాటుదారులకు మద్ధతుగా అమెరికా, యూరప్ దేశాలు లిబియాపై విమానదాడులు ప్రారంభించాయి.

③ మొక్క పెరుగుట — 2.5.2011 నుండి 10.6.2011 వరకు

-- ప్రజా ఉద్యమాలు యూరప్‌కు విస్తరించాయి.
"నిజమైన ప్రజాస్వామ్యం" కావాలంటూ స్పెయిన్, గ్రీస్, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి.

④ వ్యాపించుట — 11.6.2011 నుండి 20.7.2011 వరకు

-- యూరప్ దేశాలలో ఆర్థిక సంక్షోభం ప్రారంభం అయింది.
గ్రీస్, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, ఐర్లాండ్ మొదలైన దేశాలకు అప్పుల భారం అధికమై దివాళా తీసే పరిస్థితులు నెలకొన్నాయి.

⑤ మొగ్గ తొడుగుట — 21.7.2011 నుండి 29.8.2011 వరకు

-- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న అమెరికాలోనే ఆర్థిక సంక్షోభం మొదలైంది.
2.8.11 నాటికి అప్పులు తీర్చలేక దివాళా తీసే పరిస్థితిని అమెరికా ఆఖరి క్షణాలలో తప్పించుకున్నప్పటికీ, చివరికి అమెరికా తన యొక్క అత్యున్నత

పరపతి స్థాయి అయిన ఏఏఏ గ్రేడ్‌ని కోల్పోవడంతో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఒక్కసారిగా తీవ్ర పెనుగులాటకు లోనయ్యాయి.

-- అమెరికా ఆర్థిక సంక్షోభం ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా పరిణమిస్తూ వుండటం వలన అమెరికా డాలర్‌కి ప్రత్యామ్నాయంగా "అంతర్జాతీయ కరెన్సీ" ని ఏర్పాటు చేయవలసిందిగా చైనా డిమాండ్ చేస్తోంది.

ఈ విధంగా 11.2.2011 తరవాత ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న సంఘటనలు ఈనాటి శాసనవ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థల్ని సమూలంగా మార్చివేసే స్థాయిలో జరుగుతూ ఉండటమే కాకుండా, ఒక "అంతర్జాతీయ కరెన్సీ" ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెర పైకి వచ్చింది.

అంచేత ఈ సంఘటనలన్నీ "ఒకే విశ్వం" దిశగా జరుగుతున్నాయి అని భావించటంలో అతిశయోక్తి ఏముంది?

ఈ విధంగా 11.2.2011 న ఈజిప్ట్ విప్లవంతో చాలా చిన్నగా ప్రారంభం అయిన ఈ "విశ్వ ఏకీకరణ" ప్రక్రియ రోజు రోజుకూ మరింత వేగవంతం అవుతూ, ఈ పరిణామక్రమంలోని 5 వ రోజున "యూరప్ దేశాల ఆర్థిక సంక్షోభం" "అమెరికా డౌన్ గ్రేడింగ్" అనే మొగ్గల్ని తొడిగింది.

**ఇక్కడ ఇంకొక విశేషం ఏమిటంటే,**

అమెరికాను డౌన్ గ్రేడ్ చేసిన "స్టాండర్డ్ అండ్ పూర్" అనే రేటింగ్ సంస్థ యొక్క ప్రెసిడెంట్ ఎవరంటే, దేవెన్ శర్మ అనే ఒక భారతీయుడు.

అంచేత రానున్న రోజుల్లో వివిధ సంఘటనల ద్వారా ఈ మొగ్గలు ఏ విధంగా పుష్పించి, ఫలిస్తున్నాయో గమనిస్తూ, అందులో భారతీయుల యొక్క పాత్రను గుర్తిస్తూ, సమాజానికి తెలియజేస్తూ, మన వంతు పాత్రను నిర్వర్తిద్దాం.

❖☆❖



# వేద సంస్కృతి పునర్జాగరణ తప్పకుండా జరిగి తీరుతుంది

***వేద సంస్కృతి అంటే,***

మనిషి ప్రకృతికి అనుగుణ్యంగా జీవించే విధానం.

మనిషి ప్రకృతి శక్తులను ఉపయోగించుకుంటూ జీవించే విధానం.

మనిషి సృష్టిలో ఒక భాగం మాత్రమే కాకుండా, ఈ సృష్టిలో ఉన్న సమస్త శక్తులు అతనిలో బీజరూపంలో ఉన్నాయి అని శాస్త్రాలు తెలుపుతున్నాయి.

☆ మనిషి ఎప్పుడైతే ప్రకృతికి అనుగుణ్యంగా జీవిస్తాడో, అప్పుడు అతనిలో బీజరూపంలో ఉన్న సమస్త శక్తులు వికసించటం మొదలుపెడతాయి.

***అతనిలో ఉన్న ఈ సమస్త శక్తుల్ని మనిషి ఎంత వరకూ వికసింపచేసుకోవచ్చు అంటే,***

భగవంతుడితో సమానం అయ్యేంత వరకు, భగవంతుడిలో లీనం అయ్యేంత వరకు ఈ శక్తుల్ని అతను వికసింపచేసుకోవచ్చు.

అందుకే మనిషిని బీజరూపంలో ఉన్న భగవంతుడు అంటారు.

సృష్టిలోని ప్రతీ ప్రాణిలోనూ ఏదో ఒక విశేషమైన శక్తి లేదా గుణం ఉంటుంది. అంచేత ఆయా ప్రాణుల ఉనికి, సాహచర్యం మనిషికి ఆయా శక్తుల్ని అభివర్ధన చేసుకోవటానికి ఉపయోగపడతాయి.

అందుచేతనే మన ఋషులు తమలోని భగవతత్త్వాన్ని జాగరణ చేసుకోవడానికి అరణ్యాలను తపోస్థలిగా ఎన్నుకునేవారు.

మనలో భగవతత్త్వాన్ని జాగరణ చేసుకోవటం అన్నా, సృష్టిలో ఉన్న సమస్త శక్తుల్ని మనలో జాగరణ చేసుకోవటం అన్నా, రెండూ ఒకటే.

☆ ప్రకృతికి అనుగుణ్యంగా ఉండే సాధారణ జీవిత విధానం ద్వారా ఈ పరిపూర్ణ భగవతత్త్వ జాగరణను మనిషి కొన్ని కోట్లాది జన్మలకు సాధిస్తే,

-- వివిధ రకాల యోగ సాధనలు ద్వారా, ఆధ్యాత్మిక మార్గం ద్వారా దీనిని అతడు చాలా వేగంగా సాధించగలుగుతాడు.

అందుకే ఆధ్యాత్మికతలో షార్ట్ కట్స్ ఉండవు అని మాస్టరుగారు చెబుతూ ఉంటారు. అసలు ఆధ్యాత్మికతే చాలా అతి పెద్ద షార్ట్ కట్ అయినప్పుడు, ఇంక అందులో షార్ట్ కట్ ఏముంటుంది?

సృష్టిలో ఉన్న సమస్త ప్రాకృతిక శక్తుల్ని మన శాస్త్రాలు వివిధ రకాల దేవతలుగా అభివర్ణించాయి.

ఇంద్రుడు - ఆయన ఒక ప్రాకృతిక శక్తి.
వరుణుడు - ఆయన ఒక ప్రాకృతిక శక్తి.
వాయుదేవుడు - ఆయన ఒక ప్రాకృతిక శక్తి.
అగ్నిదేవుడు - ఆయన ఒక ప్రాకృతిక శక్తి.
దుర్గాదేవి - ఆమె ఒక ప్రాకృతిక శక్తి.
లక్ష్మీదేవి - ఆమె ఒక ప్రాకృతిక శక్తి.
ఈ లక్ష్మీదేవిలో మళ్ళీ ఎనిమిది రకాలు శక్తులు. అవే అష్టలక్ష్ములు.

☆ ఈ ప్రాకృతిక శక్తుల్ని ఉపయోగించుకునే విధానాలను వివిధ స్తోత్రాలు రూపంలో ఋషులు మనకు అందజేశారు.

ప్రాకృతికమైన దేవతా శక్తులకు వాహనాలుగా వివిధ రకాలైన జంతువుల్ని, పక్షుల్ని మన ఋషులు అలంకారిక వర్ణనగా ప్రతిపాదించారు.



ఆయా ప్రాకృతిక శక్తుల్ని జాగరణ చేసుకోవటానికి సాధకుడు తనలో పెంచుకోవాల్సిన లేదా తొలగించుకోవాల్సిన లక్షణాలను ఆ విధంగా తెలిపారు.

☆ లక్ష్మీదేవి యొక్క వాహనం గుడ్లగూబ.
గుడ్లగూబ చీకటిలో కూడా బాగా చూడగలుగుతుంది.

-- అదే విధంగా ప్రతీ విషయం వెనకాతల కనిపించకుండా ఉండే పరిస్థితుల్ని కూడా అవగాహన చేసుకోగలిగే శక్తిని సాధకుడు పెంచుకోగలిగితే, అతనిలో లక్ష్మీదేవి యొక్క శక్తి జాగరణ అయి ఐశ్వర్యాన్ని పొందగలుగుతాడు.

☆ వినాయకుడి యొక్క వాహనం ఎలుక.
అవసరం లేకపోయినా ఎలుక ప్రతీ వస్తువునూ కొరుకుతూ ఉంటుంది.

-- సాధకుడు ఈ విధంగా అనవసర విషయాల జోలికి వెళ్ళకుండా నిగ్రహించు కుంటే, అతనిలో వినాయకుడి యొక్క శక్తి జాగరణ అయి, అతనికి బుద్ధి కుశలత కలిగి, సర్వ శుభాలు చేకూరతాయి.

☆ గాయత్రీ మాత యొక్క వాహనం హంస.
హంస పాలను, నీళ్ళను వేరు చేస్తుంది.

-- అదే విధంగా సాధకుడు ప్రతీ విషయంలోనూ ఉన్న మంచిని, చెడును వేరు చేసి, మంచిని మాత్రమే స్వీకరిస్తే అతనిలో "ప్రజ్ఞ" వికసిస్తుంది. దీని వల్ల అతనికి దైవీశక్తి యొక్క మార్గదర్శనం లభిస్తుంది.

సాధారణ మానవులు విశేషమైన సాధనలు ఏవీ చేయకపోయినప్పటికీ, ప్రకృతికి దగ్గరగా జీవిస్తే, అతని చుట్టూ ఉండే రకరకాల జీవజాలం అతనికి ఏదో ఒక హితబోధ చేస్తూ, అతనిని ఆధ్యాత్మిక ఉన్నతికి తీసుకొని వెళుతుంది.

అందుచేతనే పూర్వకాలంలో ఆధ్యాత్మిక వాదానిది పై చేయిగా ఉన్నప్పుడు ప్రజలు ప్రకృతికి దగ్గరగా గ్రామాలలో జీవించడానికి ఇష్టపడేవారు.

నగరాలలో భౌతికంగా చాలా ఉన్నత స్థానాలలో ఉండే అనేక మంది వ్యక్తుల కంటే గ్రామాలలో పేదరికంలో జీవించే చాలా మంది వ్యక్తులు ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిలో ఉంటారని మేడమ్ బ్లావెట్స్కీ చెప్పేవారు.

**మనిషి యొక్క లక్ష్యం ఏమిటంటే,**

అతనిలోని అంతర్యామి అయిన భగవంతుడిని చేరుకుని,
తాను కూడా భగవంతుడిగా మారటం.

ఈ విధంగా అంతర్యాత్ర చేయడానికి భగవంతుడి యొక్క విరాట్ రూపం అయిన బాహ్యప్రకృతికి అనుగుణ్యంగా మనిషి జీవించాలి.

☆ బాహ్యజగత్తులో అతని జీవన ప్రయాణం ప్రకృతికి అనుగుణ్యంగా ఉంటే, అంతర్ జగత్తులో అతని చేతనత్వం భగవంతుని సమీపంగా చేరుతుంది.

☆ బాహ్య జగత్తులోని చరాచర జగత్తు అంతటా నిండివున్న భగవంతుడ్ని వివిధ రూపాలలో దర్శిస్తూ, ఉపాసిస్తూ జీవించే జీవిత విధానమే

"వేద సంస్కృతి".

మంత్రవిజ్ఞానం, జ్యోతిశ్శాస్త్రం, క్రతువిజ్ఞానం, ఆయుర్వేదం, వాస్తు విజ్ఞానం మొదలైనవి వేద సంస్కృతిలో భాగం అయినప్పటికీ, వేదమయ జీవిత విధానంలో ప్రధానమైనది ఏమిటంటే, ప్రకృతి సాహచర్యంలో జీవించడం.

☆ వేద సంస్కృతిలోని పై విజ్ఞానాలన్నీ ప్రకృతి అనే పరీక్షశాలలో అరణ్యాలలోను, గ్రామాలలోను వికసించినవే కదా!

ఈ వేద సంస్కృతి భారతదేశంలో వికసించినంత ఎక్కువగా మిగతా చోట్ల వికసించనప్పటికీ, ప్రకృతి శక్తుల్ని ఆరాధించే, వాటిని ఉపయోగించుకునే వివిధ పద్ధతులు ప్రపంచవ్యాప్తంగా పురాతన నాగరికతల్లో మనకు కనిపిస్తాయి.



కానీ ఒక వైపు మానవజాతి కలియుగం యొక్క ప్రభావం వలన ఈ ప్రాకృతిక భగవదారాధనా జీవిత విధానానికి దూరం అయితే, రెండవ వైపు గత 300 సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన ఆధునిక విజ్ఞానం మానవజాతి జీవిత విధానాన్ని పూర్తిగా కృత్రిమంగా తయారుచేసింది.

సూర్యోదయ సూర్యాస్తమయాలతోను, రాత్రీ పగలు తోను, ఋతువుల తోను సంబంధం లేకుండా సాగుతోన్న ఈనాటి జీవిత విధానం పూర్తిగా అప్రాకృతికంగా తయారయిపోయింది.

☆ ఆధునిక విజ్ఞానం కూడా ప్రకృతిలోని భాగమే.

-- వేదవిజ్ఞానంలో కంటికి కనిపించని ప్రాకృతిక శక్తుల్ని ఉపయోగించుకుంటే, ఆధునిక విజ్ఞానంలో కంటికి కనిపించే భౌతికమైన పదార్థ శక్తుల్ని ఉపయోగించుకుంటున్నాం. భౌతికమైనా, అభౌతికమైనా అవి రెండు భగవంతుని సృష్టిలోని, ప్రకృతిలోని భాగమేకదా!

కానీ ఈ ఆధునిక విజ్ఞానం అధికార లాలస, లాభాపేక్ష కలిగిన వ్యక్తుల ఆధ్వర్యంలో ఎక్కువగా అభివృద్ధి చెందడంతో, వారి యొక్క స్వార్థ చింతన వలన ఆధునిక విజ్ఞానం ప్రకృతిని కొల్లగొట్టే సాధనంగా మారిపోయింది.

విపరీతమైన అధిక వినియోగంతో ప్రకృతిని ఈ విధంగా కొల్లగొడుతూ పోతే, వాతావరణ కాలుష్యం వలన, వనరుల లేమి వలన రానున్న తరాల యొక్క భవిష్యత్తు అంధకారమయం అవుతుంది అనే వివేకాన్ని కూడా మానవ జాతి కోల్పోయింది. ఈ విషయాల గురించి ఎవరైనా హెచ్చరించినా, వాటిని పట్టించుకునే స్థితిలో ఈనాటి దేశాధినేతలు లేరు.

కానీ ఈ విధంగా ప్రకృతిని కొల్లగొడుతూపోయిన ఆర్థిక విధానాల యొక్క దుష్ఫలితాలను ఈనాడు ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్నాయి.

ఈనాడు ప్రపంచంలో వివిధ దేశాలలో జరుగుతోన్న ప్రజా ఉద్యమాలు ఈనాటి నేతల యొక్క ఆలోచనా విధానాన్ని మార్చే దిశగా సాగుతున్నాయి.

ఈనాడు ప్రపంచంలో వివిధ దేశాలలో ముసురుకొంటున్న ఆర్థిక సంక్షోభాలు, ఈనాటి ప్రకృతి వ్యతిరేక ఆర్థిక విధానాల తీరుతెన్నుల్ని సమూలంగా మార్చివేసే స్థాయిలో ఏర్పడుతున్నాయి.

అభివృద్ధి పేరుతో ఇంత కాలం విచ్చలవిడిగా అప్పులు చేస్తూ పోయిన ప్రపంచ దేశాలకు ఇప్పుడు ఆ అప్పులు గుదిబండగా మారడంతో, అవి పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నాయి. దీనితో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగాల కల్పన తగ్గిపోయి, నిరుద్యోగం బాగా ప్రబలుతుంది.

ఇంత కాలం అధిక వేతనాలతో ఉద్యోగాలు లభిస్తూవుండటంతో ఆధునిక జీవిత విధానం వైపు పరిగెట్టిన మానవజాతి, ఇప్పుడు అక్కడ పరిస్థితులు తల్లక్రిందులు అవుతూవుండటంతో, స్వావలంబనకు పెద్దపీట వేసే "ప్రాకృతిక జీవితం విధానం" మానవజాతికి సహజంగానే ఆశాజ్యోతిగా కనిపిస్తుంది.

ప్రాకృతిక జీవిత విధానం మనిషిని స్వావలంభిగా చేయటమే కాకుండా, ఈనాటి ఆధునిక జీవిత విధానం అందజేయలేని మానసిక ప్రశాంతతను, అంతులేని ప్రకృతి సంపదను అందిస్తుంది.

వీటితో పాటు 'ప్రాకృతిక జీవిత విధానం' లేదా 'వేద సంస్కృతి' యొక్క పునర్జాగరణ వలన మనిషిలో దేవత్వం, పృథ్వి మీద స్వర్గావతరణ జరుగుతాయి అని ఇంతకు ముందే చర్చించుకున్నాంకదా!

అంచేత దైవీ ప్రేరణతో ఏర్పడుతోన్న ఈనాటి ప్రపంచ సంక్షోభాల వలన వేద సంస్కృతి యొక్క పునర్జాగరణ తప్పకుండా పృథ్విపై జరుగుతుంది.

☆✡☆



# ఈ సంక్షోభ పవనాలు సత్యయుగారంభంలోని భాగమే

మొత్తం మానవ సమాజం యొక్క తీరుతెన్నుల్ని సమూలంగా మార్చివేసే సంక్షోభాలు ప్రపంచవ్యాప్తంగా ఈనాడు చాలా వేగంగా ఏర్పడుతున్నాయి.

కానీ ఈ సంక్షోభాలను మహాత్ములు ప్రసవ వేదనగా వర్ణిస్తున్నారు.

ఒక బిడ్డకు జన్మను ఇచ్చే ముందు తల్లి చాలా ప్రసవ వేదనను అనుభవిస్తుంది. కానీ బిడ్డ జన్మించగానే ఆ తల్లి పొందే ఆనందం వర్ణనాతీతం.

అదే విధంగా ప్రస్తుతం ప్రపంచంలో ఏర్పడుతోన్న సంక్షోభాలు కూడా ఒక నూతన యుగం ఆవిర్భవించే ముందు జరుగుతోన్న ప్రక్రియలు మాత్రమే.

ఆ సత్యాయుగావతరణ జరగగానే ఈ సంక్షోభాలు ఏవీ మనకు గుర్తుండవు. ప్రపంచంలో సర్వత్రా నవచైతన్యం వెల్లివిరియడాన్ని పులకిత అంతరంగాలతో మనం అనుభూతి చెందుతాం.

భౌతిక విజ్ఞానం యొక్క ఆవిర్భావంతో మానవజాతి ఆధ్యాత్మికతకు పూర్తిగా దూరం అయిపోయింది. భౌతిక విజ్ఞానం అందించలేని బుద్ధి, సిద్ధుల్ని ఆధ్యాత్మికత అందించగలదంటే, నమ్మగలిగే స్థితిలో ఈనాడు మానవజాతి లేదు.

ఆధునిక మానవ సమాజం తాను ఏర్పరచుకొన్న స్టాక్ మార్కెట్ వంటి ఆర్థిక వ్యవస్థల్ని ఈ సంక్షోభాల కాలంలో విశ్వసించలేక బంగారంలో పెట్టుబడులు పెట్టటానికి పరుగులు పెడుతోంది.

కానీ పెట్టుబడికి చాలా సురక్షితమైన సాధనం అని భావించే బంగారాన్ని ఈనాటి ఆధునిక విజ్ఞానం తయారు చేయలేదు.

కానీ ఆధ్యాత్మికవేత్తలు ఈ బంగారాన్ని అవసరమైనప్పుడు తయారు చేయగలరు. అనేక మంది మహాత్ములు కొన్ని విశేష కార్యక్రమాలకు అయ్యే ఖర్చులకు గాను బంగారాన్ని తయారు చేస్తూవుంటారు.

సత్యసాయియే కాదు, ధునీవాలా బాబా మొదలైన అనేక మంది బాబాల జీవితంలో కూడా ఈ బంగారాన్ని సృష్టించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

మాస్టరుగారు కూడా 2006 లో వైజాగ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 'నేను బంగారాన్ని తయారుచేయగలను. కానీ ఇప్పుడు చేయను' అని పేర్కొన్నారు.

గాయత్రీ ఉపాసనకు, బంగారాన్ని తయారు చేయటానికి ఉన్న సంబంధం గురించి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య తెలియజేసిన వివరాలను మాస్టరుగారు "గాయత్రీ - సావిత్రీ - కుండలినీ" అనే పుస్తకంలో పొందుపరిచారు. ఆ వివరాలను ఒకసారి పరిశీలిద్దాం.

**(ప్రారంభం .......)**

గాయత్రీమంత్ర ఉపాసన అంటే సూర్యుని ఉపాసనయే.

✡ వేదాలను, హిమాలయాలలో నివసిస్తున్న ఋషులను, నేటి ఆధునిక విజ్ఞానాన్ని సమన్వయపరుస్తూ పూజ్య గురుదేవులు రాబోయే "ఏకైక ధర్మము", ఉపాసనా పద్ధతి సూర్యుడి మీద ఆధారపడి ఉన్నదని తెలిపారు.

దాని సంపూర్ణ సాధన, ఉపాసన పద్ధతులు ఆయన వాఙ్మయంలో లభిస్తాయి. ఇప్పటికి 70 ఖండాలు ప్రచురించబడ్డాయి.

ఇంకొక 38 ఖండాలు రాబోతున్నాయి.



✡ పూజ్య గురుదేవులు గాయత్రీ మంత్ర ఉపాసన వలన ప్రపంచములో లుప్తమైపోయిన రెండు విద్యలు సార్వజనీనము అవుతాయి అని తెలిపారు. అవి,

① ఆయుర్వేదము

② రసవిద్య లేక బంగారమును చేసే విద్య

✡ ఆయుర్వేదానికి వాయు, సూర్య, చంద్రుల ద్వారా నియంత్రితమయ్యే వాత, పిత్త, కఫములు ఆధారములు.

-- అలాగే రసవిద్యకు వాటి ప్రతీకలైన పాదరసము, రాగి, ఇనుములు ఆధారములు.

ఈ సంబంధంలో శ్రీరామకృష్ణ పరమహంస యొక్క యోగవిద్యా గురువు అగు తోతాపురి మాటలు గుర్తుకు వస్తున్నాయి.

ఒకసారి వారు మాటలలో పరమహంసకు తన మఠము నందు గల (పంజాబులోని) ప్రధాన మహంతుకు బంగారము చేయు విద్యవచ్చునని అతడు దానిని తన చివరి ఘడియలలో తన ప్రధాన శిష్యునికి చెప్పనున్నాడు అని చెప్తూ సాధారణముగా ఎప్పుడూ బంగారము చేయబడదని కూడా చెప్పారు.

✡ కానీ కుంభమేళా మున్నగు విశిష్ట పర్వ సమయాలలో సాధువుల వసతి, సదుపాయముల కొరకు దీనిని ఉపయోగించ వచ్చునని శిష్యునితో చెప్పారని తోతాపురి చెప్పారు.

*రసాయన విద్య యొక్క సత్యమును వివరిస్తూ గాయత్రీ మంత్రమును ఉపదేశించుటకు కారణము ఏమనగా,*

గాయత్రీ మంత్రానికి రసశాస్త్రము ఆధారముగా వేరే అర్థము కలదు.

ఎవరి మీద ఆ గాయత్రి కృప వర్షిస్తుందో,
వారికి రస సంబంధమైన అర్థము దానంతట అదే స్ఫురించును.

-- మాత వారి బుద్ధిని వికసింపజేసి ఆ అర్థాన్ని తెలుసుకునే ప్రేరణనిచ్చును.

గాయత్రీ మంత్రము యొక్క 24 అక్షరములలో అన్ని విధములైన జ్ఞానవిజ్ఞానములు దాగివున్నవి.

బంగారము వంటి ధాతువులను నిర్మించుట ఒక సాధారణ విషయము.

రాక్షసరాజగు రావణుడు గాయత్రీ మంత్రాన్ని ఉపాసన చేయుటలో మహా పండితుడు.

ఈ రసశాస్త్రము ఆధారముతోనే ఆయన తన పట్టణమును బంగారు లంకగా మార్చివేసెను.

తన నాభిలో అమృతమును నింపుకున్నాడు.

**దీని భావము ఏమంటే,**

అతడు ఆకాలములోని గొప్ప వైద్యుడు. రెండవ ధన్వంతరి. ధన్వంతరి తన చేతులతో అమృతమును తీసుకొని సముద్రము నుండి వెలుపలికి వచ్చెను. కానీ రావణుడు ఆ అమృతమును తన నాభిలోనే నింపుకొనెను.

రసశాస్త్రము ఆధారముగా పాదరసమునే పరమాత్మ యొక్క సాకార రూపముగా భావించవలెను.

భగవంతుడు అధిక శక్తి సంపన్నుడు.
పాదరసాన్ని మించిన శక్తివంతమైన ధాతువు లేదు.

గాయత్రీ మంత్రమునందలి 'భర్గ' శబ్దము పాదరసమునకు రసాయనిక అర్థముగా చెప్పవచ్చును.



ఈ విద్యను తెలిసిన ఒక వైద్యుడు ప్రపంచమంతటా తిరుగుచూ రోగులకు చికిత్స చేసేవాడు.

అతడు సుమారుగా 350 సంవత్సరాలు పైబడి జీవించి ఉండవలెను. అతడు తన చేతులతో తాకినంతనే మందులు అద్భుతముగా పనిచేసెడివి.

ఈ విద్య తెలుసునని ఆయనను అనేక మంది ఈ రసవిద్యను ప్రయోగించి చూపమని వేధించగా, ఓషధుల రసములో ఆయన ఒక లోహపు ముక్కను వేసి ఒక బట్టీలో ఉంచిరి.

-- 15 రోజుల తర్వాత అది స్వచ్ఛమయిన బంగారముగా మారెను.
కంసాలి దానిని పరీక్షించి అది స్వచ్ఛమైన బంగారముగా నిర్ధారణ చేసెను.

ఈ విధానము నేర్పమని అతనిని వేధింపగా అతడు ఒక పద్యమును చెప్పెను. దాని అర్థమును గ్రహించి ఆ విద్యను తెలిసికొనమని చెప్పెను.

బహుశా ఏ పాఠకులైనా చదివి అర్థము తెలిసికొనగలరేమో!!

తోరస్ మోరస్ గర్ధక్ పారె । ఇన్హీ మార్ ఇక్ నాగ్ సవారె ॥
నాగ్ మార్ నాగిన్ కా దేయ్ । సారెజగ్ కంచన్ కర్ లేయ్ ॥

ఆ వైద్యుడు 2 సంవత్సరముల తరువాత అదృశ్యుడయ్యెను. అతని జాడ ఎవరికీ తెలియలేదు.

సామాన్య మానవులు ఒక విషయాన్ని తప్పనిసరిగా తెలిసికొని తీరాలి.

ఆధ్యాత్మికతకు, చమత్కారములకు ఏ విధమైన సంబంధము లేదు.

-- ఈ మార్గమున నడిచిన వారికి కొన్ని అతీంద్రియ శక్తులు వికసించును. వానిని మహత్వపూర్ణమైన ప్రయోజనము కొరకు ప్రకృతి యొక్క విధానమును అనుసరించి ఉచ్చస్తరీయ ఆత్మలే సదుపయోగము చేసికొనగలవు.

వీరు వీటిని ఎక్కడ పడితే అక్కడ వెదజల్లుతూ తిరుగరు.

✡ ఎవరైతే వాటిని ప్రదర్శించుటకు ఉత్సాహము చూపిస్తారో, వారు నిజముగా సిద్ధ పురుషులు కారు, గారడీవారు మాత్రమే.

(...... ముగింపు)

అంచేత రానున్న సత్యయుగంలో బంగారాన్ని తయారుచేసే రసవిద్య సార్వజనీనం అవుతుంది.

అందుచేతనే సత్యయుగాన్ని "స్వర్ణయుగము" అని కూడా అంటారు.

✡ రసవిద్యలాంటి ఒక అద్భుతమైన విద్య సార్వజనీనం అయ్యే కాలంలోకి మనం ప్రయాణం చేస్తున్నప్పుడు,

-- ఆయుర్వేదం ద్వారా నాభిలో అమృతాన్ని నింపుకోగలిగే విద్య మానవ జాతికి అందుబాటులోకి వచ్చే కాలంలోకి మనం ప్రయాణం చేస్తున్నప్పుడు, తాత్కాలికంగా ఇప్పుడు కలిగే సంక్షోభాలను భరించటానికి ఆ మాత్రం సిద్ధపడాల్సిందే కదా!

అంచేత రానున్న సత్యయుగానికి మనల్ని సన్నద్ధం చేస్తూ, ప్రస్తుతము ప్రపంచాన్ని చుట్టుముడుతోన్న ఆర్థిక సంక్షోభాన్ని 14.8.2011 నాటి "సాక్షి" దిన పత్రికలోని ఒక వ్యాసం ద్వారా అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం.

(ప్రారంభం ......)

✧ ప్రమాదం అంచున ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

✧ సంక్షోభం ముంగిట ఐరోపా దేశాలు

✧ అమెరికా డౌన్‌గ్రేడింగ్ కన్నా డేంజర్

✧ ఫ్రాన్స్‌ను తాకిన ఋణ సంక్షోభం



✧ ఇటలీలో ముందస్తు చర్యలు

✧ గడ్డుకాలమే అంటున్న ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు

✧ చెల్లింపు సంక్షోభం వస్తుందేమోనని భయపడుతున్న భారత మార్కెట్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరో మాంద్యం అంచుకు చేరుకుంటున్నదా?
నిన్న అమెరికా, నేడు ఐరోపా దేశాలను కుదిపివేస్తున్న ఋణ సంక్షోభం రానున్న ఆర్థిక మాంద్యానికి సూచికలేనా?

"ఔను!" అంటున్నారు ఆర్థిక విశ్లేషకులు.

అమెరికాను వణికించిన ఋణ సంక్షోభం, పరపతి కోత ఇపుడు ఐరోపాను గజగజలాడిస్తున్నాయి. యూరో జోన్‌లోని దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభం అమెరికా డౌన్‌గ్రేడింగ్ కన్నా ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు.

మొట్టమొదటగా ఈ వారం ప్రారంభంలో ఐరోపా యూనియన్‌లోని ఫ్రాన్స్‌ను ఋణ సంక్షోభం తాకింది.

✡ ఐరోపా ఆర్థిక వ్యవస్థకు ఫ్రాన్స్, జర్మనీ మూలస్తంభాలు వంటివి.

ట్రిపుల్ ఏ క్రెడిట్ రేటింగ్ నిలబెట్టుకోవడం కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీ చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించేలా లేవు.

నష్టాల భయంతో ఫ్రెంచ్ బ్యాంక్ షేర్లను భారీ సంఖ్యలో అమ్మేస్తూ ఉండడం, ఆర్థిక వృద్ధి నిలిచిపోవడం ఫ్రాన్స్ ప్రస్తుత దుస్థితికి కారణం.

ఈ వారం వెయ్యి కోట్ల యూరోల(1,420 కోట్ల డాలర్ల) మేర ఫ్రెంచ్ బ్యాంకుల మార్కెట్ విలువ తుడిచిపెట్టుకుపోయింది. బ్యాంకు షేర్ల షార్ట్ సెల్లింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేయడంతో పరిస్థితి కొద్దిగా పుంజుకున్నట్లు కనిపిస్తున్నప్పటికీ అది శాశ్వత పరిష్కారం కాదని అంటున్నారు.

ఫ్రాన్స్ బాటలోనే ఇటలీ, స్పెయిన్, బెల్జియం కూడా షేర్ల షార్ట్‌సెల్లింగ్‌ను నిషేదించాయి.

ఋణ సంక్షోభం కుదిపేస్తున్న యూరోజోన్‌లోని మూడో అతి పెద్ద దేశం ఇటలీ. అతలాకుతలమవుతున్న మార్కెట్‌ను రక్షించడం, ఋణ వ్యయాలను తప్పించడం కోసం యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఇటలీ బాండ్లను కొనాల్సి వచ్చింది. ఇంకా వ్యయాలను తగ్గించడం, పన్నులు పెంచడం వంటి పొదుపు చర్యలు చేపడుతున్నప్పటికీ పరిస్థితి అదుపులోకి రావడం లేదని ఇటలీ ఆర్థిక మంత్రి గిలియో ట్రెమాంటీ చెబుతున్నారు.

ఇటలీ 6,500 కోట్ల డాలర్ల మేర పన్నులను పెంచింది. 2013 నాటికి బడ్జెట్ సమతుల్యం కోసం అనేక పొదుపు చర్యలను అది ప్రతిపాదించింది.

ఐరోపా ఋణ సంక్షోభం ఫ్రాన్స్, ఇటలీ వంటి పెద్ద దేశాలకే కాక గ్రీస్, ఐర్లాండ్ వంటి దేశాలకు కూడా విస్తరిస్తున్నది. యూరో అనిశ్చితి తమకు అశని పాతం వంటిదని బ్రిటన్ చాన్స్‌లర్ జార్జి ఆస్‌బోర్న్ పేర్కొన్నారు.

అటు అమెరికాలోనూ, ఇటు ఐరోపాలోనూ ఋణ సంక్షోభం తలెత్తడం భారత మార్కెట్ వర్గాలను, ముఖ్యంగా ఎగుమతిదారులను కలవరపరుస్తున్నది. చెల్లింపుల సంక్షోభం ఏర్పడవచ్చుననే భయాలు వారిని వెంటాడుతున్నాయి.

ప్రస్తుత పరిస్థితులలో ఎగుమతులకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ఉండడం కోసం ఎగుమతిదారులకు పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలూ అందించే విషయమై ఆర్థికశాఖతో వాణిజ్యశాఖ చర్చలు జరుపుతున్నది.

✡ అమెరికా, ఈయూ నుంచి వచ్చే ఎగుమతి ఆర్డర్లను స్వీకరించాలో లేదో తెలియడం లేదని ఢిల్లీ ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ అగర్వాల్ పేర్కొన్నారు.



గ్రీస్ కూడా భారత ఎగుమతులకు మంచి మార్కెట్. ప్రస్తుతం గ్రీస్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. ఇటలీ, స్పెయిన్‌ది కూడా అదే దారి.

- భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరిన్ని ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుందని ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ రాబర్ట్ జోలిక్ హెచ్చరించారు.

-- యూరోజోన్‌లో ఋణ సంక్షోభం కారణంగా అనేక సంపన్న దేశాల్లో ఊపిరి తీసుకోలేని పరిస్థితులు ఉండొచ్చని, వచ్చేది గడ్డుకాలమేనని పేర్కొన్నారు.

అమెరికా డౌన్‌గ్రేడింగ్ అంశం కన్నా యూరోజోన్ దేశాల ఋణ సంక్షోభమే మధ్య, దీర్ఘకాలిక సమస్యలుగా పరిణమించే ప్రమాదము ఉందని జోలిక్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులు 2008 నాటి సంక్షోభం నాటికన్నా భిన్నమైనవని ఆయన చెప్పారు. చాలా సంపన్న దేశాలు ఇప్పటికే తమకు అందుబాటులో ఉన్న ఆర్థికపరమైన వ్యూహాలన్నీ అమల్లో పెట్టేశాయని జోలిక్ తెలిపారు.

ప్రపంచ ఎకానమీకి యూరోజోన్ పరిణామాలే అసలైన సవాలుగా నిలుస్తాయని, స్పెయిన్, ఇటలీ ఎలాగో గట్టెక్కుతాయని ఆశాభావం ఉన్నా గ్రీస్, పోర్చుగల్ విషయంలో తేల్చుకోలేని పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు.

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు యూరోపియన్ యూనియన్ ఇప్పటిదాకా తగిన స్థాయిలో చర్యలు చేపట్టలేకపోయిందని జోలిక్ అభిప్రాయపడ్డారు. చుట్టుముట్టిన సమస్యల నుంచి తప్పించుకుని యూరోపియన్ దేశాలు అసలు ముందుకెళ్ళగలవా అన్న సందేహం తలెత్తుతోందని జోలిక్ చెప్పారు.

ఇటీవలి అల్లర్లతో ఆందోళన చెందకుండా పొదుపు చర్యలను కొనసాగించాలని బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరాన్‌కి ఆయన సూచించారు.